# స్టడీ అవర్స్




(అదో హాస్టల్ రూం! తెర తీయగానే పిల్లలంతా ఆడుకుంటూ కన్పిస్తారు! ఉన్నట్టుండి ఫ్యూన్ గంటకొట్టిన శబ్దం విన్పిస్తుంది ! ఆడుకుంటోన్న పిల్లలు బెల్ వినగానే - పోలోమంటూ ఎక్కడివాళ్ళక్కడ పుస్తకాలు పట్టుకుని - చదవడానికి కూర్చుంటారు. కొంతమంది స్టడీఅవర్స్‌లో కూర్చుంటారే గానీ - వాళ్ళ దగ్గర పుస్తకాలు ఉండవ్ ! కొంతమంది వద్ద పలకలు ఉంటాయిగానీ- బలపాలు ఉండవ్ ! కొంతమంది దిక్కులు చూస్తూ, మరికొంత మంది తలలుగోక్కుంటూ వుంటారు. ఇంతలో వార్డెన్ వచ్చి:)

| | | |
|---|---|---|
| వార్డెన్ | : | ఎందుకలా కూర్చున్నావ్ ?పలకమీద 'అఆ'లు రాయి ! |
| రాము | : | (భయపడ్తూ... తత్తరపడ్తూ...) బ...బ... బలపం లేదండీ ! |
| వార్డెన్ | : | నిన్నెప్పుడు అడిగినా బలపం లేదంటావేం ? ఏం చేస్తున్నావ్ బలపాల్ని ? |
| గోపి | : | వాడు... ఎవరూ చూడకుండా తినేస్తున్నాడు మేడమ్ ! మీతో చెప్తానంటే... కొడ్తానని బెదిరిస్తున్నాడు. |
| వార్డెన్ | : | (కళ్ళెర్రజేసి) అవునా రామూ ? |
| రాము | : | కా... కా... కాదు మేడమ్ ? |
| వార్డెన్ | : | (గద్దించి) నిజం చెప్పు ! |
| రాము | : | ఆ... అవును మేడమ్ ! |
| వార్డెన్ | : | రంగన్నా ! |
| రంగన్న | : | (ప్రవేశిస్తూ) మేడమ్ ! |
| వార్డెన్ | : | రేపటినుండి ఈ అబ్బాయికి టిఫిన్లో పూరీ ఇవ్వకు ! బలపాల్ని ఇవ్వు ! తిక్క కుదుర్తుంది ! |
| రాము | : | (లెంపలు వేసుకుంటూ) తప్పయింది మేడమ్ ! ఇంకోసారిలా చేయను. క్షమించండి. |
| వార్డెన్ | : | సర్లే... వెళ్లు! ఇదిగో బలపం! మళ్ళీ పోగొట్టుకున్నావంటే పూర్కోను! ఆ బలపానికో దారం కట్టి నీ మెడకి కట్టేస్తాను! అర్థమైందా ? (రాము బుద్ధిగా తలూపుతాడు) |
| రంగన్న | : | అమ్మా - ఎవరో పేరెంట్సట! మీతో మాట్లాడ్తామంటున్నారు! (పేరెంట్స్‌తో మాట్లాడటానికి వార్డెన్ అక్కడినుండి వెళ్ళిపోగానే అందాకా బుద్ధిమంతుల్లా ఉన్న పిల్లలంతా - పుస్తకాల్ని గిరాటేస్తారు! జాన్, ఇస్మాయిల్ ఒకరికెదురుగా మరొకరు కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ వుంటారు! సీతా - దీప్తి గచ్చకాయలు ఆడ్తూ వుంటారు. విక్రమ్ ట్విస్ట్ చేస్తూవుంటాడు.) |
| లీడర్ | : | (విక్రమ్‌ని చూసి) ఏయ్ కూర్చో.... ఏమిటా అల్లరి ? ఇవి స్టడీఅవర్స్! |
| విక్రమ్ | : | పోవే పో! నువ్వు ఎంత లీడర్వి అయితే మాత్రం.... నువ్వు పుస్తకాల్లో కామిక్స్ పెట్టి చదువుకోవచ్చుగానీ... నేను ట్విస్ట్ చేయకూడదా ? నా డాన్స్...నా ఇష్టం ! మధ్య నీ పెత్తనమేమిటీ?.. కావాలంటే.... ఇదిగో నా వద్ద - 'చందమామ'ఉంది ! ఇదీ ఇస్తాను ! నోర్మూసుకో ! |
| విజయ్ | : | ఒరేయ్.... మీరు అల్లరి చెయ్యకండిరా - మీకు పుణ్యం |

వుంటుంది ! నేను అసలే లెక్కలు చేస్తున్నాను! ఒక్కటీ అర్థమై చావట్లేదు! - ఒక్క క్షణం మేడం కన్పించకపోతే చాలు - వీళ్ళ కోతి వేషాలకి పట్టపగ్గాలుండవ్!

దీప్తి : సీతా... ఏమిటే అది ?

సీత : నెయిల్ పాలిష్ ? నిన్న మా అన్నయ్య తెచ్చిచ్చాడు!

దీప్తి : అబ్బ.... ఎంత బావుందో ! నా గోళ్లకి వేసుకోనా ?

సీత : ఇంద తీసుకో !

అరుణ : నాక్కూడా ఇవ్వవే !

సీత : నువ్వూ తీసుకో !

(వాళ్ళు గోళ్ళకి రంగువేసుకుంటూ వుంటారు ఇంతలో-)

జాన్ : ఏయ్.... వార్డెన్ వస్తున్నారు !

(సీత, దీప్తి, అరుణలు మేడమ్‌ని చూడగానే - గబుక్కున తమ వీపు వెనక్కి చేతులు మడిచిపెట్టి - నెయిల్ పాలిష్ దాచేసి- ఆ చేతులు తీయకుండానే చదువుతున్నట్టు పోజులు పెడ్తారు. పుస్తకాల్లోని పేరాలు చదువుతున్నట్లు పెదాలు కదిలిస్తూ..... ఎక్కడి పిల్లలక్కడ... గప్‌చిప్ న... ఏమీ ఎరుగని వాళ్ళలా.... చదువుతూ వుంటారు)

వార్డెన్ : జాన్!... ఇలారా ! ఆ పలక మీద 'అఆలు' రాయి!

(జాన్ జారుతోన్న లాగు పైకి లాక్కుంటూ వచ్చి అఆలు రాస్తూ వుంటాడు)

వార్డెన్ : ఇస్మాయిల్ ! నీ పుస్తకం ఇలా తే !

(ఇస్మాయిల్ అందిస్తాడు.)

వార్డెన్ : (పుస్తకంలోకి చూస్తూ) 'పాంచాలి'... విగ్రహవాక్యం చెప్పు!

ఇస్మాయిల్ : పాంచాలి... పాంచాలి... (నీళ్ళు నములుతూ) పాంచాలా మేడమ్?

వార్డెన్ : ఊఁ

ఇస్మాయిల్ : పాంచాలి.... పాంచాలి అంటే.... పంచుల యొక్క ఆలి... పాంచాలి !?

వార్డెన్ : (వ్యంగ్యంగా) గుడ్... ఎలా చెప్పావ్ అంత కరెక్ట్‌గా ?

ఇస్మాయిల్ : (పొంగిపోతూ) మరేనండీ... పంచ పాండవుల భార్య పేరు పాంచాలి కదండీ ! అందుకని పంచుల యొక్క ఆలి.... పాంచాలి.

వార్డెన్ : నీ మొహం ! పంచుల యొక్క ఆలి కాదు... పాంచాల దేశ

| | | |
|---|---|---|
| | | రాజ కుమార్తె కాబట్టి ఆమెకి పాంచాలి అని పేరు వచ్చింది. అర్థమైందా ? |
| ఇస్మాయిల్ | : | (ముఖం చిన్నబుచ్చుకుని - గుటకలు మింగి) ఆ... ఆ... అర్థమైందండీ ! |
| రంగన్న | : | (ప్రవేశిస్తూ) అమ్మా - మీకు ఫోన్. |
| వార్డెన్ | : | వస్తున్నా. |
| | | (వార్డెన్ రంగన్నతోపాటు ఆ హాల్లోంచి వెళ్ళిపోగానే - దీప్తి అరుణలు బెంచీకి అటు ఒకరూ - ఇటు ఒకరూ నేల మీద కూర్చుని కునికిపాట్లు పడుతూ చదువుతూ వుంటారు ! సీత వెళ్లి, వాళ్ళ జడల్ని ఒకర్దాకర్తో ముడేసి - ఆనందిస్తూ వుంటుంది! ఆ ముడి వాళ్ళు నిద్ర పోయినప్పుడల్లా - ముందుకు తూలి పడ్తోన్న వాళ్ల తలల్ని తిరిగి వెనక్కి వచ్చేలా- చేస్తూ వుంటుంది ! చివరకు వాళ్ళకు మెలకువ వచ్చి - విషయం గ్రహించి - సీతని ఒంగోబెట్టి దబాదబా బాదుతారు- తమ ముళ్ళు విప్పుకోకుండానే) |
| సీత | : | (లెంపలేసుకుంటూ) కొట్టకండే ! తప్పయిందే ! ఇంకెప్పుడూ అలా చెయ్యను! ఒట్టు! |
| దీప్తి | : | (బెంచీ మీద దర్జాగా కూర్చుని) మరి మా జడలు విప్పు!? |
| సీత | : | (భయం భయంగా... వాళ్ళ జడలు విప్పి) మేడమ్‌కి చెప్పకండే- నా వీపు చీరేస్తారు! |
| అరుణ | : | చెప్పనుగానీ - మాకో పని చేసి పెట్టాలి ! |
| సీత | : | ఏమిటదీ ? |
| అరుణ | : | నాకు నిద్రొస్తోంది ! నేను నిద్రపోతా ! టీచర్ వస్తే నాకు చెప్పాలి! ఒక రకంగా... నువ్వు నా నిద్రకి కాపలా అన్నమాట- అర్థమైందా....? |
| సీత | : | సరే! |
| దీప్తి | : | నేనూ పడుకుంటా ! కాని మంచంకింద పడుకుంటా ! అయితే ఒక్కటి ! నేనిక్కడ పడుకున్నానని మేడంకి చెప్పొద్దు! నా విషయం అడిగితే - బాత్‌రూంకి వెళ్లానని చెప్పాలి! |
| | | (దీప్తి మంచం కింద దూరి పడుకుంటుంది - తను కన్పించ కుండా మంచం మీది దుప్పటి లాక్కుంటుంది! గోపీ చక్కిలాలు తింటూ వుంటాడు.) |
| విక్రమ్ | : | ఒరేయ్ ! నాకో చక్కిలం ఇవ్వరా ! |
| గోపి | : | నేనివ్వను ! నా దగ్గర రెండే ఉన్నాయి ! |

| | | |
|---|---|---|
| విక్రమ్ | : | అదేం కుదర్దు ! ఇవ్వాల్సిందే ! మొన్న నేను ఇవ్వలేదా ? ఇప్పుడు నువ్వివ్వాలి ! |
| గోపి | : | నేనివ్వను ! |
| విక్రమ్ | : | ఇవ్వవా.... చూడు నిన్నేం చేస్తానో ? (విక్రమ్ గోపీని రెండంటించి - వాడి చేతిలోని చక్కిలం కాస్తా లాగేసుకుంటాడు ! గోపీ కుయ్యో మొర్రో అంటాడు) |
| ప్రవీణ్ | : | విక్రమ్ ! నువ్వు గోపీని కొట్టావ్ కదూ ! మేడం రానీ - చెప్తాను! |
| విక్రమ్ | : | పోరా... నేను మేడమ్‌కి పట్టుబడ్డేగా ! వాణ్ణి నిముషంలో నవ్విస్తాను చూడూ ! ఒరేయ్ గోపీ ! నేను ఒకటీ - రెండూ - మూడూ అని లెక్కెట్టేలోగా... నువ్వు నవ్వాలి! నవ్వకపోతే - మరి రెండు అంటిస్తాను! అండర్‌స్టాండ్! (గోపీ నవ్వడు) |
| విక్రమ్ | : | ఒకటీ.... (గోపీ ఇంకా బిగదీసుకునే వుంటాడు) |
| విక్రమ్ | : | రెండూ.... (గోపీలో ఏదో కొంచెం కదలిక...) |
| విక్రమ్ | : | మూడూ... (గోపీ - వస్తోన్న ఏడ్పు నాపుకుని... అటు నవ్వలేకా... ఇటు ఏడ్వలేకా... చివరకి విక్రమ్ భయానికి 'హీ... హీ... హీ'.... అని నవ్వేస్తాడు) |
| జాన్ | : | (చిటికెన వేలు చూపించి): లీడర్ ! |
| లీడర్ | : | నీకెప్పుడూ అదే పని ! నేను పంపను ! కూర్చో ! |
| జాన్ | : | అబ్బ... లీడర్... ప్లీజ్ ! (పొట్ట పట్టుకుని అసహనంగా అటూ ఇటూ తిరుగుతూ వుంటాడు) |
| లీడర్ | : | (విసుగ్గా) కూర్చోమని చెప్పానా ? సిడౌన్ ! (జాన్ ఆగలేక - అక్కడే ఓ మూలన వన్ ఫింగర్ చేసేస్తాడు) |
| అందరూ | : | షేమ్ ! షేమ్ ! (ఇంతలో ప్రవీణ్ ఏడుస్తూ వుంటాడు!) |
| లీడర్ | : | ప్రవీణ్ ! నీకేమైందిరా ఏడుస్తున్నావ్ ? |
| రాము | : | వాడి ముక్కులో బలపం పెట్టుకున్నాడు. అదేమో రావట్లేదు! |
| గోపి | : | రంగన్నని పిలవనా - తీస్తాడేమో ? |
| ప్రవీణ్ | : | వొద్దు వొద్దు ! వార్డెన్‌కి తెలిస్తే నన్ను చంపేస్తారు! |

విక్రమ్ : (గ్రీకు వీరుడి లెవెల్లో) భయం వలదు బిడ్డా ! ముక్కులో బలపం ! ఓష్ ! ఇదెంత పని ? నేను తీస్తాలేరా ?

లీడర్ : వొద్దురా ! నీకు చేతకాదు.. ప్రమాదం !

విక్రమ్ : అరే - పిరికి వెధవా ! నా పేరేమిటో తెలుసా ? విక్రమ్- అంటే - పరాక్రమవంతుణ్ణి ! అలాంటి నాకు... ముక్కులో బలపం... అదో లెక్కా ? అవమానం ! అవమానం !

(విక్రమ్ ఆ బలపం తీయబోతూ వుంటే - అది ఇంకా - ఇంకా లోపలికి పోతూ వుంటుంది)

విక్రమ్ : (కంగారుగా) అయ్యో... అది ఇంకా... ఇంకా... లోపలికి పోయిందిరా ! ఇప్పుడెలా ?

లీడర్ : చావు ! నేను ముందే చెప్పానా ? ఇప్పుడు ప్రవీణ్ గాడు వుంటాడో - హరీమంటాడో ?

అందరూ : అయ్యో....

(అందరూ ఒక్కసారిగా రాగాలు తీస్తారు. వార్డెన్ పరుగెత్తుకుని వస్తుంది ! అరుణకి మెలకువ వచ్చి దిగ్గున లేచి కూర్చుంటుంది! మంచం క్రింద పడుకున్న దీప్తికయితే మెలకువే రాదు!)

వార్డెన్ : (గద్దించి) ఏమైంది ? ఏమిటా రాగాలు ?

(అందరూ ఒక్కసారే రాగాలు ఆపుతారు)

వార్డెన్ : బెల్లంకొట్టిన రాయిలా నిలబడ్డారేం ? చెప్పండి ఏమైందో?

లీడర్ : (ధైర్యం తెచ్చుకొని) ప్రవీణ్... ముక్కులో బలపం పెట్టుకున్నాడండీ ! విక్రమ్ - మరేమోనండి... దాన్ని తీస్తానని ట్రై చేశాడండీ ! కాని - అదేమోనండి... ఇంకాస్త లోపలికి పోయిందండీ!

వార్డెన్ : (విక్రమ్‌ని రెండంటించి) నువ్వేమైనా డాక్టర్వా ? ఇంకోసారి- నీకు తెలీని విషయాల జోలికి వెళ్తావా ?

విక్రమ్ : వెళ్లను మేడమ్ !

వార్డెన్ : రంగన్నా !

రంగన్న : అమ్మా !

వార్డెన్ : అర్జంట్‌గా ఈ అబ్బాయిని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లు! నేను నీ వెనకాలే వస్తాను ! పద - ఊఁ క్విక్ !

రంగన్న : అలాగే అమ్మా !

(రంగన్న ప్రవీణ్‌ని తీసుకెళ్తాడు - వార్డెన్ వెళ్ళిపోతోందల్లా- మంచం కింద నుంచి కన్పిస్తోన్న దీప్తి కాళ్ళని గమనించి -

ఆగి పోతుంది)

(సీత ఓవంక వార్డెన్‌ని చూస్తూ - మరోవంక దీప్తిని లేపడానికి ట్రై చేస్తూ - కాలి వేళ్ళతో ఆమె కాళ్లని గిర్తూ వుంటుంది!)

దీప్తి : పోవే - నాకు నిద్రోస్తోంది !

(వార్డెన్ సీతని చూస్తూ 'నువ్వు మాట్లాడకు' అన్నట్టు సైగచేసి- మెల్లిగా మంచం దగ్గరకు వెళ్లి దీప్తి కాళ్ళు పట్టి బయటకు లాగుతుంది. అప్పటికీ దీప్తికి మెలకువ రాదు! పైగా ఆ నిద్ర మత్తులో తనను కాదన్నట్టుగా ఇంకో వైపు తిరిగి)

దీప్తి : అబ్బ ! అప్పుడేనా ? కాస్సేపు పడుకోనివే ! మేడమ్ ఇప్పుడప్పుడే రారు ! ఇప్పట్లో ఆ ఫోన్ వదుల్తారా - ఏమన్నానా?

వార్డెన్ : (దీప్తిని కుదిపి) దీప్తీ... దీప్తీ... (వార్డెన్ పిలుపుకి దీప్తి కళ్ళు తెరిచి - 'ఆ' అని నోరు తెరచుకుని - బిక్క చచ్చిపోతూ వుండగా.... తెర)

**ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక - తేదీ: 10-1-1991**

**అంకితం**



**శ్రీమతి వి. ప్రభాదేవి**
M.A.,M.Ed.
**నిజామాబాదు.**

**ఆ**మె కంఠం - ఖంగు మంటుంది !

ఉనికి - అప్రమత్తం చేస్తుంది!!

పనిలో వేగం, చొరవ... ఆమె ప్రాణం !!!

సోమరులకి - ఆమె సింహస్వప్నం !!!!

అయినప్పటికినీ... ఆమె తన సంస్థలో బెదిరిపోయే లేళ్ళని దువ్వి - జూలు విదిల్చే సింహాలని అదిలించి... తన దారికి తెచ్చుకుంటారు. ఈసురోమని జోగే మనుషుల భుజాలు తట్టి, తనతో పాటు వడివడిగా ముందుకు నడిపిస్తారు !

**ఆమె... ఓ సెలయేరు !** అవరోధాలెన్ని ఎదురైనా- అవలీలగా దాటి - గల గలా ముందుకు సాగి - అజేయంగా నిలవడం - ఎలాగో - విద్యార్థులకి చెప్పడం - ఆమె ప్రత్యేకత!

పరిసరాలను ప్రభావితం చేస్తూ - జెట్ వేగంతో - ఓ చైతన్యాస్త్రంలా దూసుకుపోయే విజయ్ హైస్కూల్, నిజామాబాద్ కరెస్పాండెంట్: **శ్రీమతి వి. ప్రభాదేవి** కి...

ప్రేమతో....

1-11-2005